

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లకు నేటితో ముగియనున్న గడువు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి సోమవారంతో గడువు ముగియనున్నది. ఈ నెల మూడో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. శుక్రవారం వరకు ఎనిమిది మంది 14 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లను 11వ తేదీ పరిశీలన చేస్తారు. 13వ తేదీ ఉపసంహరణకు గడువిచ్చారు. ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి.

## కమ్మేసిన పొగమంచు

**ఉదయం 9.30 గంటల వరకు వీడని వైనం**

- 15 రోజులుగా ఇదే పరిస్థితి
- ఉద్యాన పంటలు దెబ్బతింటాయని రైతుల్లో ఆందోళన



సబ్బవరంలో ఆదివారం ఉదయం దట్టంగా కురుస్తున్న పొగమంచు

సబ్బవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఆదివారం ఉదయం 9.30 గంటల వరకు పొగమంచు వీడలేదు. దీంతో వాహనాలు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాయి. పొగమంచు వల్ల తీగ జాతి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో పొగమంచు తీవ్రత తగ్గడం లేదు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా మంచు ప్రభావం కొనసాగుతోంది. గత పదిహేను రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో ఉదయం వేళ సైతం ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు వల్ల చిన్నారులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ఇక ఉద్యాన పంటల్లో తీగ జాతి రకాలైన కాకర, పచ్చ, బీర, ఆనపతో పాటు జీడి, జీడిమామిడి పూత పిందెపైన తీవ్ర ప్రభావం చూపిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచు వల్ల తీగ జాతి ... మిగతా 6వ పేజీలో

## కబళించిన కెరటం

**ఇంజనీరింగ్ విద్యార్థి మృతి, మరొక విద్యార్థి గల్లంతు**

- ఇరువురూ అన్నదమ్ముల బిడ్డలే
- వాడపాలెం సముద్రతీరంలో విషాదం



సూర్యతేజ (ఫైల్ ఫొటో)



పవన్‌తేజ (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం వాడపాలెం సముద్ర తీరంలో ఆదివారం సాయంత్రం విషాదం చోటుచేసుకుంది. స్నానానికి దిగిన ఇంజనీరింగ్ విద్యార్థి ఒకరు ప్రమాదవశాత్తూ చనిపోగా, మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి పోలీసులు, మెరైన్ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని కొత్తపేటకు చెందిన అన్నదమ్ములైన ... మిగతా 6వ పేజీలో

## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- ఇంటర్మీడియట్ జిల్లా అధికారిణి సుజాత

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. జిల్లాలో అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు (ప్రైవేట్) 35, మోడల్ కళాశాలలు నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఈ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. జిల్లా నుంచి 13,969 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఎంపీసీలో 6,112, బైపీసీలో 3,162 మంది కలిపి 9,274, అలాగే ఒకేషనల్ విద్యార్థులు 4,695 మంది ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ పరీక్షలను మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఐ పవర్ కమిటీ ఒకటి చొప్పున పర్యవేక్షిస్తాయని ఆమె తెలిపారు.

## ఐదేళ్ల కుమారుడితో సహా మహిళా హోంగార్డు ఆత్మహత్య

- భర్త వేధింపులే కారణం



ఝాన్సీ, దినేష్‌కార్తీక్ (ఫైల్ ఫొటో)

- వార్త మెయిన్‌లో..

## క్రైబ్స్‌పై కొరడా

**కెమికల్ కంపెనీని మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలి ఆదేశం**



క్రైబ్స్ బయో కెమికల్ కంపెనీ

- విజయవాడ శివారున వ్యర్థాలను పారబోసినట్టు విచారణలో నిర్ధారణ
- తొలుత షోకాజ్ నోటీసు.. తరువాత మూసివేతకు ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కశింకోట మండలం కొత్తపల్లిలో ఉన్న క్రైబ్స్ బయో కెమికల్ కంపెనీని మూసివేయాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) ఆదేశించింది. కంపెనీలో ఉత్పత్తుల ద్వారా వచ్చే ప్రమాదకర ఘన, జల వ్యర్థాలను విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలోని పొలాల్లో పారబోయడాన్ని పీసీబీ తీవ్రంగా పరిగణించింది. దీనిపై కంపెనీకి ఏపీపీసీబీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆ తరువాత ఉత్పత్తుల నిలిపివేత, కంపెనీ మూసివేతకు ఈ నెల 7న సభ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

క్రైబ్స్ బయో కెమికల్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో పలు రకాల రసాయన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులు కొన్నింటిని సిమెంట్ తయారీకి ముడి సరకుగా వాడతారు. ఈ క్రమంలో కంపెనీ నుంచి ఎప్పటికప్పుడు లారీల్లో ఉత్పత్తులు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో సిమెంట్ కంపెనీకి రవాణా చేస్తుంటారు. అయితే కంపెనీలో ఉత్పత్తులు తయారీ సమయంలో వచ్చే ఘన, జల వ్యర్థాలను యాజమాన్యం శుద్ధి చేయాల్సి ఉంది. కానీ కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్‌కు వెళ్లాల్సిన లారీ ఒకటి ఈ నెల 3న కృష్ణా జిల్లా విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామ సమీపంలో పొలాల్లో వ్యర్థాలను పారబోసింది. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీ చేసి ల్యాబ్‌కు పంపగా, అటువంటి ఫార్ములాతో ఉత్పత్తులు చేసేది క్రైబ్స్ కంపెనీగా గుర్తించారు. వెంటనే విజయవాడలోని పీసీబీ అధికారులు విశాఖలోని పీసీబీ అధికారులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో విశాఖలో ప్రాంతీయ పర్యావరణాధికారి పి.ముకుందరావు, ఇతర అధికారులు నేరుగా కంపెనీని తనిఖీ చేసి ఉత్పత్తులను పరిశీలించారు. విజయవాడ దరిలో పారబోసిన వ్యర్థాలు క్రైబ్స్ కంపెనీవిగా ... మిగతా 6వ పేజీలో

## గిరిజనుల గుండె గుబిల్లు

**రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు రావడంతో షాక్**



డోలవానిపాలెంలో వేలాది రూపాయల విద్యుత్ బిల్లులు వచ్చాయని చూపుతున్న బాధితులు

రావికమతం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వాకంతో నిరుపేద గిరిజనులకు విద్యుత్ బిల్లు వేలాది రూపాయల్లో వచ్చింది. దీంతో వారు షాక్‌కు గురయ్యారు. 200 యూనిట్ల వరకు ఉచితమని చెప్పి ఇప్పుడు బిల్లు వేలాది రూపాయల్లో రావడమేమిటని వారు వాపోతున్నారు.

మండలంలోని టి.అర్జాపురం పంచాయతీ శివారు డోలవానిపాలెం గిరిజన గ్రామానికి చెందిన డోలా సత్తిబాబు ఇంట్లో రెండు బల్బులు, టీవీ మాత్రమే ఉన్నాయి. శనివారం విద్యుత్ సిబ్బంది వచ్చి విద్యుత్ మీటర్ రీడింగ్ తీశారు. రూ.1.6 లక్షల కరెంట్ బిల్లు వచ్చిందని చెప్పి తమకు ఇచ్చి వెళ్లిపోయారని సత్తిబాబు తల్లి లక్ష్మి వాపోయింది. అలాగే గాది నాగరాజుకు రూ.29,913 బిల్లు వచ్చింది. 200 యూనిట్ల వరకు నిరుపేద గిరిజనుల ఇళ్లకు కరెంట్ ఉచితమని చెప్పి ఒక్కసారే రూ.వేలల్లో బిల్లు ఇవ్వడమేమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులు చేసుకునే తాము ఎలా కట్టగలమని వాపోతున్నారు. ఈ విషయమై ఏపీఈపీడీసీఎల్ రావికమతం ఏఈ నందన్‌ను సంప్రతించగా సాంకేతిక సమస్య వల్ల బిల్లులు అలా వచ్చాయని, వాటిని సరిచేస్తామని చెప్పారు.

## లోవపాలెం తీరాన్ని అభివృద్ధి చేయాలని వినతి



సీఎం రమేశ్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

రాంబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్.చింతువా పంచాయతీ లోవపాలెం సముద్ర తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మండల తెలుగుయువత అధ్యక్షుడు ఎరిపిల్లి అజయ్, జడ్.చింతువా పంచాయతీ మాజీ సర్పంచ్ ఎరిపిల్లి చిట్టిబాబు ఎంపీ సీఎం రమేష్‌ను కోరారు. ఈ మేరకు అనకాపల్లిలో ఆదివారం ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో లోవపాలెం తీరం ఉందన్నారు. దీనిని ఆనుకొని ఉన్న కొండపై పరశురామన్న స్వామివారు కొలువుదీరి ఉండడంతో పర్యాటకులు ప్రతిరోజూ ఈ తీరానికి వస్తున్నట్టు చెప్పారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం మరింత ప్రాచుర్యం పొందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ‘అధిస్తాన్’లో ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య బృందం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అధిస్తాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఏర్పాటైన 135వ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరు వందల మంది హాజరుకాగా, 390 మందికి పరీక్షలు జరిపారు. ఇందులో 295 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందించారు. 40 మందికి కంటికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## నేడు పది గ్రామాలకు విద్యుత్ అంతరాయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల పది గ్రామాలకు సోమవారం ఎనిమిది గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. వైర్ల కింద చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున ఈ అసౌకర్యం కలగనుందని వివరించారు. ఈ కారణంగా దిబ్బపాలెం, ఆర్‌ఆర్ కాలనీ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, వెదురువాడ, వైఎస్సార్ నగర్, సాయిప్రియ లేఅవుట్, బర్మా కాలనీ, మాటూరు రోడ్డు, మరిడిమాంబ కాలనీలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

## ఆటో చోరీపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు

ఎలమంచిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద ఆటో చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ సావిత్రి ఆదివారం తెలిపిన వివరాలివి. ఎస్.రాయవరం మండలం కోనవానిపాలెం గ్రామానికి చెందిన ఎస్.వరహాలు శనివారం దిమిలి రోడ్డు జంక్షన్ కూరగాయల మార్కెట్ వద్ద తన ఆటోను నిలిపారు. మార్కెట్లోకి వెళ్లి తిరిగి వచ్చి చూడగా, ఆటో కనిపించకపోవడంతో చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

# బడిలోనే బోధన.. భోజనం..

- ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు ప్రభుత్వం వినూత్న ప్రయత్నం
- వంద రోజుల ప్రణాళిక అమలు
- సెలవు దినాల్లోనూ మధ్యాహ్న భోజనం అందిస్తుండడంతో విద్యార్థుల్లో ఆనందం



ఎలమంచిలి ఆర్‌ఎస్ రోడ్డులోని పాఠశాలలో భోజనం చేస్తున్న టెన్త్ విద్యార్థులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ వినూత్న ఆలోచన పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపుతోంది. విలువైన సమయం వృథా కాకుండా ఉంటుందని తెగ సంబరపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఈ విద్యార్థులకు సెలవు దినాల్లో కూడా భోజనాన్ని అందిస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్న సంకల్పంతో విద్యాశాఖ వంద రోజుల ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా సదరు విద్యార్థులకు పాఠశాలల సెలవు దినాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా విద్యార్థులు చక్కగా తరగతులకు హాజరవుతున్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులంతా మధ్యాహ్న భోజనా నికి పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి భోజనానంతరం తరగతులకు అష్టకష్టాలు పడి రావాల్సి వచ్చేంది. దీనివల్ల పరీక్షలు సమీపిస్తున్న వేళ తమ విలువైన సమయం వృథా అవుతోందని వారంతా ఆవేదన వ్యక్తం చేసేవారు. ఇది గుర్తించిన కూటమి ప్రభుత్వం ఇటువంటి సమయంలో కొత్త ఆలోచనకు తెరతీసింది. పదో తరగతి విద్యార్థులకు రెండవ శనివారం, ఆదివారం రోజుల్లోనూ మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సెలవు దినాల్లో వీరికి మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డిస్తున్నారు. అలాగే, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించి చదువులో వెనుకబడిన విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారు. దీంతో పట్టుదలతో చదువుకుని మంచి ఫలితాలు సాధిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఏదిఏమైనా విద్యాభివృద్ధి ప్రభుత్వం ఇటువంటి వినూత్న ఆలోచనలు చేస్తుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తల్లిదండ్రులను గౌరవించడం బాధ్యత



వాడ్రాపల్లిలో పెద్దలను సత్కరించిన దృశ్యం

మునగపాక, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని వేంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి పెదరామస్వామి ఆలయంలో పెతకంశెట్టి రామజోగినాయుడు సారథ్యంలో 18 మంది వృద్ధ దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ తల్లిదండ్రుల్లో దైవత్వం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల వరహా నర్సింగరావు, మళ్ల శేషు, కొణతాల శివరామకృష్ణ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



వాడ్రాపల్లిలో కలుసుకున్న మునగపాక పాఠశాల 1986-87 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

మునగపాక, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అమెరికా ఎంత దూరంలో ఉన్నా.. అభి మానం ముందు అది చిన్నదేనని పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక చాటిచెప్పింది. 73సంవత్సరాల చరిత్ర కలిగిన మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం పర్యాటక ప్రాంతమైన వాడ్రాపల్లిలో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన వారిలో చాలా మంది పక్కనున్న అనకాపల్లి మొదలు కొని అమెరికా వరకు ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడంతో అస్సాం, హైదరాబాద్, విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం తదితర సుదీర్ఘ ప్రాంతాల నుంచి విచ్చేశారు. తొలుత ఒకరినొకరు ఆప్యా యంగా పలుకరించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఇదే బ్యాచ్ కు చెందిన వెలగా శివ సూరిబాబు సుమా రు 40 మంది మిత్రులకు తన సొంత ఖర్చులతో ఏడాది పాటు బీమా సౌకర్యం కల్పించారు. పెంటకోట గిరిబాబు, కాం డ్రేగుల జగదీశ్వరరావు, వెలగా సురేష్‌కుమార్, ఏవీఎన్ మూర్తి, బుద్ధ మహాలక్ష్మినాయుడు, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## కబళించిన కెరటం



సంఘటనా స్థలంలో పోలీసులు

... 5వ పేజీ తరువాయి

మొక్క శ్రీధర్, మల్లికార్జునరావులు విశాఖలో స్థిరపడ్డారు. ఎల్‌అండ్‌టిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ కంచరపాలెం ప్రాంతంలోని ఇంద్రానగర్‌లో, సీఐఎస్‌ఎఫ్‌లో పనిచేస్తున్న మల్లికార్జునరావు దువ్వాడ సంధ్యానగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీధర్ ఒక్కగానొక్క కుమారుడు సూర్యతేజ (17) తగరపువలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో, ఆదినారాయణ ఒక్కగానొక్క కుమారుడు పవన్‌తేజ (17) దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. శ్రీధర్, మల్లికార్జునరావులు పూజల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం స్వగ్రామమైన కొత్తపేట వచ్చారు. పూజా కార్యక్రమాలు పూర్తిచేసుకొని మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వాడపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. సూర్యతేజ, పవన్‌తేజ సహా నలుగురు తీరానికి సమీపంలో స్నానాలు చేస్తుండగా బలమైన కెరటం ఒకటి లోపలకు లాగేసింది. తీరం వద్ద బీట్‌లో ఉన్న మెరైన్ పోలీసులు చూసి ముగ్గురిని రక్షించారు. మరొకరి ఆచూకీ దొరకలేదు. మెరైన్ పోలీసులు రక్షించిన ముగ్గురిలో కొనఊపిరితో ఉన్న సూర్యతేజ (17) ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయాడు. గల్లంతైన పవన్‌తేజ (17) ఆచూకీ కోసం పోలీసులు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, రాంబిల్లి సీఐ నరసింగరావు, మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్‌ఐ నాగేంద్రలు సిబ్బందితో కలిసి వాడపాలెం సముద్రతీరం వద్దకు చేరుకున్నారు. సూర్యతేజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. కాగా సూర్యతేజ మృతదేహం వద్ద అతని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు పలువుర్ని కలచివేసింది. ఈ ఘటనతో కొత్తపేటలో విషాదం అలుముకుంది.

## క్రెబ్స్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

నిర్ధారించి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో ఈ నెల 7న సభ్య కార్యదర్శి శరవన్ కొత్తపల్లిలో క్రెబ్ కంపెనీ మూసివేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### కంపెనీపై అనేక ఫిర్యాదులు

క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీపై చాలా కాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. కంపెనీ నుంచి వచ్చే దుర్గంధంతో సమీపంలోని కేజీబీవీ పాఠశాల, తేగాడలో మోడల్ స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధిచేయకుండా శారదా నదిలోకి విడిచిపెట్టడం, కంపెనీని ఆనుకుని గొయ్యిలో నింపుతున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితం కావడంతో కంపెనీ సమీపంలోని గంటవానిపాలెం గ్రామస్థులు గతంలో ఆందోళనలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీసీబీ అధికారులు తనిఖీలు చేసి 2023 డిసెంబరులో ఒకసారి కంపెనీని మూసివేయాలని ఆదేశించారు. తరువాత పీసీబీ నిబంధనల మేరకు కంపెనీ కొన్ని దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో గత ఏడాది జనవరిలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించడానికి అనుమతించారు. తాజాగా కంపెనీ నుంచి వ్యర్థాలు విజయవాడ రూరల్‌లోని జక్కంపూడిలో పారబోయడంతో విచారణ జరిపిన పీసీబీ మరోసారి మూసివేతకు ఆదేశాలు ఇచ్చింది.

## కమ్మేసిన పొగమంచు



దేవరాపల్లి మండలం నాగయ్యపేటలో మంచు

... 5వ పేజీ తరువాయి

పంటల్లో ఆకులు, పూత మాడిపోతాయని చెబుతున్నారు.

### దేవరాపల్లిలో...

**దేవరాపల్లి:** మండలంలో ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు పొగమంచు వీడలేదు. రెండు రోజుల క్రితం రాత్రి వేళ వర్షం మాదిరిగా మంచు కురిసింది. ఆదివారం కూడా పొగమంచు దట్టంగా కురిసింది. దీని వల్ల మామిడి, జీడి, నువ్వులు పూత మంచుకు మాడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### పాయకరావుపేటలో..

పాయకరావుపేట రూరల్, : మండలంలోని గ్రామాలలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఈ పొగమంచు వల్ల రైతులు, వాహన చోదకులు, పాదచారులు ఇ బ్బంది పడుతున్నారు. తెలవారుజామున మంచు ఎక్కువగా కురవడంతో రోడ్డుపై ఎదురెదురు వాహనాలు కనిపించక ప్రమాదం సంభవించే అవకాశం ఉం డడంతో వాహన చోదకులు భయపడుతున్నారు. ఉదయం 8గంటల వరకు మంచు తెరలు తొలగడం లేదు.



పాయకరావుపేట మండలం గోపాలపట్నం రోడ్డులో..

## ఘనంగా 23వ సప్తాహ మహోత్సవం

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేటలో ఆదివారం సీతా కోదండ రామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి ఆలయంలో 23వ సప్తాహ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. 23 ఏళ్లుగా గ్రామస్థుల సహకారంతో ఏటా భీష్మ ఏకాదశి తరువాత సప్తాహ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు భజనలు చేస్తూ భక్తి గీతాలు ఆలపిస్తారు. మహోత్సవం ముగింపు తరువాత భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



పవళింపుసేవలో ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

## ఘనంగా పాండు రంగడి శ్రీపుష్పయాగం

పాయకరావుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాధా రుక్మిణి సహిత పాండురంగస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీపుష్పయాగం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి, నారాయణాచార్యులు పాండురంగస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో అలంకరించి అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో ప్రతిష్ఠించి ఊరేగించారు. అనంతరం పుష్ప ఊయలపై స్వామి, అమ్మవార్లను పవళింపచేసి శ్రీపుష్పయాగ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.దివ్యతేజతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 3న ప్రారంభమైన స్వామివారి దివ్యకళ్యాణోత్సవాలు శ్రీపుష్పయాగంతో ఘనంగా ముగిశాయి.

## విద్యార్థుల ప్రగతి ఉజ్వల భవిష్యత్తుకు నాంది



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల కార్యదర్శి విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతే వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది అవుతుందని శ్రీప్రకాష్ వి ద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్ అ న్నారు. ఆదివారం పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యా సం స్థల్లో ఏర్పాటుచేసిన అభినందన సభలో పాఠశాల నుంచి కళాశాల వరకు పలు విద్యా, ఆటపాటలు తదితర పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలో ప్రతిభ కనబర్చిన సుమారు 1050 మంది విద్యార్థులకు విజయ్‌ప్రకాష్ అభినందనలు తెలియజేసి బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉన్నత ల క్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేవలం చదువులోనే కాకుండా వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా తగిన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత



గాయపడిన గీత కార్మికుడిని పరామర్శిస్తున్న సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, ఫిబ్రవరి ( (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు రాయుడు పాండవులు ఇటీవల తాటి చెట్టు నుంచి కల్లుగీస్తుండగా జారిపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆదివారం శెట్టిబలిజ, గీత కార్మిక సంఘం ప్రతినిధులు కుడిపూడి సత్తిబాబు, గుత్తుర్తి పాండురంగ, పిల్లి రాంబాబు, దుంగా అప్పలరాజు, పాలకవి వెంకన్న, బత్తిన సత్యనారాయణ, వారికి బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందజేశారు. ప్రమాదాలకు గురైన గీత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# టెన్త్ బాలికలకు మాతృమూర్తుల ఆశీస్సులు



తల్లులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

నక్కపల్లి, ఫి బ్రవరి 9 (ఆం ధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో టెన్త్ చదువుతున్న బాలికలు మంచి ఫలితాలు సాధించాలని ఆశిస్తూ, టీచర్లు, బాలికల తల్లులు ఆశీస్సులు అందజేశారు. ఆదివారం ప్రిన్సిపాల్ సువర్ణకుమారి నేతృత్వంలో టెన్త్ బాలికల పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న బాలికలు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి తల్లిదండ్రులు సహకరించాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా సూచించారు..

వారిని అనునిత్యం ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం బాలికలు వారి మాతృమూర్తుల పాదాలకు నమస్కరించగా, తల్లులు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో దళిత సంఘాల నాయకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అంబేడ్కర్ పార్కులో కొత్తగా ఏర్పాటుచేసిన విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణంలో జాతీయ రహదారి అవతల పార్కులో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని కొందరు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధ్వంసమైన విగ్రహం స్థానంలో ఏర్పాటుచేసిన కొత్త విగ్రహాన్ని దళిత నాయకులు గారా ప్రసాద్, పెదపాటి మేఘరంజన్, పల్లా విలియంకేరి, నెలపర్తి అర్జున్ తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, చిరుకూరి పేర్రాజు, తాటిపర్తి లోవరాజు, కువల కుమార్, పల్లా ప్రసాద్, బోడపాటి శ్రీను, ముక్కుడుపల్లి దాసు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ‘క్షతగాత్రునికి మెరుగైన వైద్యం అందించాలి’

అచ్యుతాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని క్రిస్టల్ ఫార్మా కెమికల్ కర్మాగారంలో సోమవారం గాయపడిన కార్మికునికి మెరుగైన వైద్యం అందజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. కర్మాగారంలో రసాయనాలు లీకై జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుశీల్ ఓరియన్ (23) తీవ్ర అస్వస్థతకు లోనై అచ్యుతాపురంలో గల ఒక ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ని పరామర్శించిన రాము మాట్లాడుతూ సెజ్ కర్మాగారాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిపై విచారణ జరపటంతో పాటు నివేదికలను బహిర్గతం చేయాలని, డిమాండ్ చేశారు.

## రాంబిల్లిలో బీజేపీ నేతలు సంబరాలు

రాంబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ) : డిల్లీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నేతలు సంబరాలు జరుపుకున్నారు..ఈ సందర్భంగా పార్టీ మండలఅధ్యక్షులు కారేరాముడు మాట్లాడుతూ 27 ఏళ్ల తరువాత బీజేపీ డిల్లీ పీఠాన్ని కైవసం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజాన సన్యాసినాయుడు, ధర్మాల గోవిందరెడ్డి, ఉమ్మిడి వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 37 ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు నాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. పాఠశాలలో సాయంత్రం వరకు సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు ప్రసాదరావు, రామనాగులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆచంట రామకృష్ణ, ఎస్. నాగభూషణం, దండు శివ, తోట రమేశ్, కర్రి రమేశ్, ఎల్. చిన్నారావు, వరహాలు, సుందరలత, జానకీదేవి, సత్యవతి, విజయలక్ష్మి, శ్రీనివాస్, రాజారావు, బాల మౌళి, తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని జయించి చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులతో బుల్లితెర నటుడు సత్తిపండు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడిని జయించి చదివితే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలరని బుల్లితెర నటుడు జబర్దస్ సత్తిపండు సూచించారు. మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. నిద్రలో కనేది కల, సమాజాన్ని మేలుకొల్పేది కళ అని అన్నారు. కళల పట్ల అవగాహన కలిగికలిగి ఉంటే ఎల్లప్పుడూ నూతన ఉత్సాహంతో జీవితాన్ని కొనసాగించగలమని ఆ కాంక్షించారు. అలాగే, ప్రతీ ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు మా త్రమే స్వీకరించాలని సూచించారు. అలాగే, సత్తిపండు గణితంలోని కొన్ని మెలకులను విద్యార్థులకు వివరించారు. బుల్లితెర నటుడైన సత్తిపండు ఉపాధ్యాయుడు కావడంతో, ఆయన కుమారుని వివాహానికి పీఆర్‌టీయూ సభ్యులను ఆహ్వానించేందుకు పాఠశాలకు విచ్చేసినట్టు సంఘ మండల ప్ర ధాన కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మోటూరి నాగేశ్వరరావు, పీఆర్‌టీయూ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



యంత్రార్చన సహిత సౌరయాగంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

## వైభవంగా యంత్రార్చన సహిత సౌరయాగం

నర్సీపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని పాత శారదా స్కూల్ ఆవరణలో ఆదివారం యంత్రార్చన సహిత సూర్య నమస్కార సౌరయాగం వైభవంగా జరిగింది. పట్టణంలోని పురోహితులు, అర్చకులు సంయుక్తంగా నిర్వహించిన సౌరయాగంలో 12 మంది రుత్వికులు సూర్యార్చన చేసి సౌర యాగం నిర్వహించారు. సుమారు వంద మంది దంపతులు గణపతి పూజలో పాల్గొని సూర్య భగవానుడుకి స్వహస్తాలతో అర్చన చేశారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి యంత్రాలను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు: సీఐ



మెయిన్ రోడ్డుపై ఆక్రమణలు తీయిస్తున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ గోవిందరావు హెచ్చరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి అబీద్ సెంటర్, కృష్ణాబజార్ వరకు ఆదివారం రోడ్డుకిరువైపులా మెయిన్ రోడ్డును ఆక్రమించి దుకాణాలదారులను హెచ్చరించారు. షాపు పరిధి దాటి రోడ్డుపై సామగ్రి పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో కేశవస్వామి కల్యాణ ఉత్సవాలు



స్వామివారి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

చోడవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకేశవస్వామి కల్యాణ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సుప్రభాతం, తోమాల అర్చన, విశేష హోమం నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు అధికంగా పాల్గొన్నారు. అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు, రామ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్త బృందం సభ్యులు ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఉప్పల బాబు, బ్యాంకు రాము తదితరులు పాల్గొన్నారు.

## గీత కులాల మద్యం షాపుల లాటరీ వాయిదా

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎక్సైజ్ ప్రొహిషన్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ సోమవారం జరగాల్సిన గీత కులాల వారి మద్యం షాపుల లాటరీ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున వాయిదా వేసినట్టు వివరించారు. దరఖాస్తుదారులంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## గాఢ నిద్రలో నిఘా నేత్రాలు

» నాతవరం మెయిన్ రోడ్డులో పనిచేయని సీసీ కెమెరాలు



పనిచేయని సీసీ కెమెరా

నాతవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నాతవరం మెయిన్ రోడ్డులో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దొంగతనం జరిగితే ఈ కెమెరాల ఆధారంగా ఆగంతుకులు దొరికే సందర్భాలు ఉన్నాయి. గత ఏడాది నాతవరంలో కోళ్ల దొంగతనం జరగగా, దొంగలు కోళ్లు పంచుకునే దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డయ్యాయి. దీంతో వారిని పట్టుకోవడం సులువైంది. మూడు రోజుల క్రితం నాతవరంలో శెట్టి నాయుడునాయుడుకు చెందిన మేకపోతును ఇంటి దగ్గర ఉంచగా దొంగలు పట్టుకుపోయారు. అలాగే గవిరెడ్డి రమణకు చెందిన గొర్రె పోతు, గొర్రెపిల్లను చోరీ చేశారు. అదే సీసీ కెమెరాలు పని చేసి ఉంటే దొంగలు దొరికే అవకాశం ఉండేదని బాధితులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని వారు కోరుతున్నారు.

## ఎన్‌జీ పాలెం వద్ద తప్పిన పెను ప్రమాదం

» లారీ, ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీ.. ఆరుగురికి గాయాలు

కశింకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనగుంటపాలెం (ఎన్‌జీ పాలెం) జాతీయ రహదారిపై ఆదివారం లారీ, ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. ఒడిశాలోని పూరీ నుంచి తెలంగాణకు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఇక్కడి నూతనగుంటపాలెం వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జయ్యింది. డ్రైవర్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆ సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 30 మందిలో సుమారు ఐదుగురు స్వల్పంగా గాయపడినట్టు తెలిసింది. డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. లారీ అక్కడి నుంచి పరారైంది. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారుగా తెలిసింది. అనంతరం ఎక్స్‌కవేటర్ సహాయంతో బస్సును పక్కకు తీశారు.



# ఇరుకు మార్గం.. రాకపోకలు నరకం!

- » చిన్న రోడ్డులోనే భారీ వాహనాల ప్రయాణం
- » పయనీర్ కంపెనీ లారీలే 400 వరకు జర్నీ
- » చిన్న బండ్లు కడవరకూ వాటి వెనుక వెళ్లాల్సిందే
- » ఎదురెదురు వాహనాలు తప్పించుకోవడానికి అగచాట్లు
- » వాహన చోదకులు, ప్రయాణికులు, ప్రజల పడరాని పాట్లు
- » ఇదీ నర్సీపట్నం-తాళ్లపాలెం రహదారిలో దుస్థితి

**అసలే ఇరుకు మార్గం.. ఆపై భారీ వాహనాల ప్రయాణం.. ఎదురెదురు పడితే తప్పించుకోవడానికి ప్రత్యక్ష నరకం.. బైకులు, చిన్న బండ్లు కడవరకూ వాటి వెనుకే వెళ్లాల్సిన దైన్యం.. ఈ క్రమంలో వాహన చోదకులు, ప్రయాణికులు, ప్రజలు ఎదుర్కొనే కష్టాలు వర్ణనాతీతం.. ఇదీ నర్సీపట్నం-తాళ్లపాలెం రహ'దారిద్ర్యం'!**



దుంగలవానిపాలెం వద్ద ఇరుకు రోడ్డులోనే భారీ వాహనాల రాకపోకలు... (ఇన్‌సెట్‌లో) శెట్టిపాలెం మార్గంలో వెళ్తున్న వాహనాలు

మాకవరపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నం-తాళ్లపాలెం రహదారి చిన్నదిగా ఉండడంతో పయనీర్ కంపెనీకి వస్తున్న లారీల వల్ల వాహనదారులతో పాటు ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. ఈ మార్గంలో గత ఐదేళ్లలో జరిగిన ప్రమాదాలకు ఎంతో మంది బలపోయారు. అయినప్పటికీ సమస్యను ప్రభుత్వాలుగాని, పయనీర్ కంపెనీగాని పట్టించుకోలేదు. 2017లోని టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం వరకు 30 కిలోమీటర్ల పొడవులో సుమారు రూ.33 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత లారీల బరువు వల్ల రహదారి దెబ్బతింది. అయినప్పటికీ ప్రభుత్వంగాని, కంపెనీగాని మరమ్మతులు చేపట్టకపోవడంతో మాకవరపాలెం మండలానికి చెందిన నాలుగు వెంకన్నపాలెం, శెట్టిపాలెం, జడ్.గంగవరం, భీమబోయినపాలెం పంచాయతీల ప్రజలు గోతులను కప్పుకున్నారు. ఈ ప్రాంతాలకు ఆనుకుని సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున రోడ్డుకిరువైపులా తుప్పలు పెరిగిపోయి మరింత ఇరుకుగా మారింది.

దీంతో కంపెనీకి లారీలు వస్తున్నాయంటే ఎదురుగా వస్తున్న వాహనాలు ఆగిపోవాల్సిందే. ఒకవేళ ముందుకు వెళ్లితే ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇలా ఈ గ్రామాల్లో గత మూడు నెలల్లో 25 ప్రమాదాలు జరిగాయి.

ప్రస్తుతం మాకవరపాలెం నుంచి తాళ్లపాలెం సెంటరు వరకు 18 కిలోమీటర్లు ఆర్అండ్‌బీ రోడ్డు ఏడు మీటర్లు మాత్రమే ఉంది. వైసీపీ ప్రభుత్వంలో 18 కిలోమీటర్ల రోడ్డును మరో 23 అడుగులు పెంచేందుకు రూ.105 కోట్లతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు రాకపోవడంతో ఇరుకు రోడ్డుగానే ఉండిపోయింది. ఫలితంగా ప్రతి రోజూ ఫైనీయర్ కంపెనీకి చెందిన దాదాపు 250 లారీలు అధిక బరువుతో ముడి సరుకు తీసుకుని ఈ మార్గంలో వస్తుండడంతో సమస్య జటిలమవుతోంది. దీనికితోడు ప్రతి రోజూ నర్సీపట్నం నుంచి విశాఖపట్నం సుమారు 40 బస్సులు రాకపోకలు సాగిస్తున్నారు. లారీల వల్ల వీటి ప్రయాణం మరో గంట అదనంగా పడుతుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎదురెదురు వాహనాలు తప్పించుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో వాహన చోదకులు, ప్రయాణికులు, ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

### రోడ్డు విస్తీర్ణం పెంచకపోతే ప్రమాదాలు పెరిగే ఆస్కారం

-నారాయణరెడ్డి, జేఈ, ఆర్అండ్‌బీ

ప్రస్తుతం రోడ్డు 23 అడుగులు ఉంది. మరో 23 అడుగులు పెంచాలని గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపాం. అయినప్పటికీ నిధులు రాలేదు. భవిష్యత్తులో విస్తీర్ణం పెంచకపోతే రోడ్డు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా ప్రమాదాలు మరింత పెరిగే ఆస్కారం లేకపోలేదు.

## మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మరికొంత మంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. ఘటాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ వెనుక భాగంలో వంటావార్పు చేసుకొని విందు భోజనాలు ఆరగించారు. స్థానిక న్యాయవాది శ్రీనాథ ప్రసాదరావు, ప్రమోదులు భక్తులకు ఉచిత అన్న సంతర్పణ కార్యక్రమాన్ని, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు.

## విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం నులి పురుగుల నివారణ మందులు ఇవ్వాలని మండల విద్యా శాఖాధికారి మూర్తి తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఉపాధ్యాయలకు ఆయన సూచించారు.

## నేత్రపర్వంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరం గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మాకవరపాలెం నుంచి తామరం గ్రామం వరకు విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం చిడతల డ్యాన్సులు, హరి భజనలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## చౌడువాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడి మృతి



వెంకన్న (ఫైల్)

కె.కోటపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చౌడువాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు బండారు వెంకన్న పాత్రుడు ఆదివారం మృతి చెందారు. డీసీసీబీ డైరెక్టర్‌గా, డీసీఎంఎస్ డైరెక్టర్‌గా, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా ఆయన పని చేశారు. వెంకన్నపాత్రుడు భార్య నారాయణమ్మ కె.కోటపాడు జడ్పీటీసీగా కూడా పనిచేశారు. ఆయన మృతి పట్ల స్థానిక నాయకులు సంతాపం తెలిపారు.

## నాతవరంలో కబడ్డీ, వాలీబాల్ కోర్టు నిర్మాణం

నాతవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్ కోర్టు నిర్మిస్తున్నారు. పీఎంశ్రీ నిధులు రూ.లక్ష వ్యయంతో కోర్టు నిర్మాణ పనులు చురుకుగా చేపడుతున్నారు. కబడ్డీ, వాలీబాల్ కోర్టు నిర్మాణ పనులు పూర్తయితే క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని హెచ్ఎం రవిశంకర్ తెలిపారు. త్వరలోనే ఈ కోర్టు అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

## తురువోలు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం

పూర్వ విద్యార్థుల తీర్మానం



హెచ్ఎంకు విరాళం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తురువోలు పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. 2007-08 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. వారంతా చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. అలాగే కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఆనందంగా గడిపారు. వెనకబడిన తమ స్నేహితుల పిల్లలకు విద్య, వైద్య పరమైన సహాయం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి శక్తిమేరకు సాయపడదామని పేర్కొన్నారు. తమకు విద్యాభ్యాసం చేసిన గురువులను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని హెచ్ఎం కె.రామకృష్ణకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు జీపీఏ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్డిపలో బీజేపీ నాయకుల సంబరాలు

రావికమతం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం పట్ల గుడ్డిప గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరావు ఆధ్వర్యంలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్.శ్రీను, ఎం.శ్రీను. జి.కల్యాణ్. గల్లా నాయుడు బాబు, ఎస్.మధు తదతరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనలో ఇద్దరు మహిళలకు గాయాలు



గాయపడ్డ వరహాలమ్మ.. రాము

గొలుగొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇనుప రాడ్డుతో ఓ వ్యక్తి దాడి చేసిన ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సాలికమల్లవరం గ్రామంలో మాతే రాజబాబు ఇంటి దగ్గరలో ఆదివారం ట్రాక్టర్ నిలిపి ఉంది. ఈ ట్రాక్టర్ ఎవరికి చెందినదని వరహాలమ్మను రాజబాబు ప్రశ్నించారు. అక్కడితో ఆగకుండా వెనక నుంచి ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతో వరహాలమ్మ చెయ్యి విరిగిపోయిందని స్థానికులు తెలిపారు. అదే రాడ్డుతో కొత్త రాము తలపై కూడా బలంగా కొట్టడంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు అక్కడ చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

## శారదా నదిలో పడి విజయనగరం వాసి మృతి



షేక్ ఇస్మాయిల్ (ఫైల్)

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదా నదిలో ప్రమాదవశాత్తూ జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందినట్టు ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య తెలిపారు. విజయనగరానికి చెందిన షేక్ ఇస్మాయిల్ (63) శుక్రవారం సాయంత్రం అక్కడి నుంచి అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న దేవీనగర్‌లో నివాసముంటున్న చెల్లెలు తాజు ఇంటికి బస్సులో బయల్దేరారన్నారు. అనకాపల్లి వచ్చిన ఆయన శారదానది ఒడ్డున శివాలయం సమీపంలో నదిలో దిగే సమయంలో ప్రమాదవశాత్తూ జారిపడిపోయి మృతిచెంది ఉంటారని భావిస్తున్నట్టు చెప్పారు. విజయనగరం నుంచి బయల్దేరిన ఇస్మాయిల్ చెల్లెలు ఇంటికి చేరకపోవడంతో అనుమానం వచ్చి వెతకగా, ఆదివారం నదిలో మృతదేహం తేలి ఉండడాన్ని కుటుంబీకులు గుర్తించారన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

## ఇంటర్వ్యూ..

### కలప అక్రమ రవాణా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

కె.శ్రీనివాసరావు, అటవీ రేంజ్ అధికారి



**కలప అక్రమ రవాణా నిరోధానికి రేంజ్ పరిధిలో నాలుగు టీములుగా ఎంపిక చేసి నిఘా పెట్టాం. గ్రామాల్లో అటవీ ఉత్పత్తులపై ఆధారపడే ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి, అడవులు పచ్చగా ఉంటే మనుగడకు ఎంతో ఉపయోగమని చెబుతున్నాం. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు కలప అక్రమ రవాణాపై 20 కేసులు నమోదు చేసి, రూ.1.24 లక్షల అపరాధ రుసుం విధించాం.**

**ప్రశ్న:** రేంజ్ పరిధిలో కలప అక్రమ రవాణా అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** రేంజ్ పరిధిలోని కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో నాలుగు టీములుగా ఎంపిక చేసి నిరంతరం నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు ఆకస్మికంగా దాడులు నిర్వహిస్తున్నాం.

**ప్ర:** అడవుల్లో మంటలు చెలరేగకుండా తీసుకునే చర్యలు ఏమిటి?

**జ:** గ్రామాల్లో అటవీ ఉత్పత్తులపై ఆధారపడే ప్రజలకు ప్రతి ఏటా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. అడవులు పచ్చగా ఉంటే మనుగడకు ఎంతో ఉపయోగమని చెబుతున్నాం.

**ప్ర:** రేంజ్ పరిధిలో అటవీ సంపద కోసం నర్సరీ ఏర్పాటు చేస్తున్నారా?

**జ:** 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా కృష్ణాదేవిపేటలో 20 వేలు, గొలుగొండలో 50 వేల సంచుల్లో నర్సరీలు ఏర్పాట్లు పనిచేస్తున్నాం.

**ప్ర:** 2024-25లో ఎన్ని కేసులు నమోదు చేశారు. ఎంత ఆదాయం వచ్చింది?

**జ:** 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 20 కేసులు నమోదు చేసి, రూ.124 లక్షల అపరాధ రుసుం విధించాం.

**ప్ర:** భీమవరం అటవీ చెక్‌పోస్టు ఎందుకు తీసేశారు?

**జ:** పునర్విభజనలో నర్సీపట్నం డివిజన్ కొత్తగా ఏర్పాటు కావడంతో భీమవరం అటవీ చెక్‌పోస్టు మా పరిధి నుంచి పెదవలస రేంజ్ పరిధికి మారింది. సిబ్బంది కొరతతో చెక్‌పోస్టు మూతపడింది.

**ప్ర:** 2025-26లో టేకు ప్లాంటేషన్లు వేస్తున్నారా?

**జ:** కృష్ణాదేవిపేట సెక్షన్‌లోని కొప్పుకొండ-నల్లగొండ ఏరియాలో పాత టేకు ప్లాంటేషన్ పరిధిలో రెండు చోట్ల 26 హెక్టార్లలో టేకు ప్లాంటేషన్లు వేయడానికి ప్రతిపాదించాం.

-కృష్ణాదేవిపేట, ఆంధ్రజ్యోతి

## 12న తాండవలో నల్లగొండమ్మతల్లి గిరి ప్రదక్షణ

నాతవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవలో కొలువైన నల్లగొండమ్మతల్లి అమ్మవారి గిరి ప్రదక్షణ ఈ నెల 12న నిర్వహించనున్నట్టు ఆలయ పూజారి గంటా కొండలరావు తెలిపారు. ఉదయం అమ్మవారి ఆలయం నుంచి భక్తులు ఆడకూల, జాల్లారిపేట గ్రామాల మీదుగా తాండవ కొండచుట్టు వరకు పది కిలోమీటర్లు గిరిప్రదక్షణ చేస్తారని, తిరిగి ఆలయానికి చేరుకుంటారని చెప్పారు. భక్తులకు ప్రసాదం, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు

## చంద్రయ్యపేటలో 'తాత' తీర్థం

కె.కోటపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో సేవా కార్యక్రమాలతో చంద్రయ్యపేట గ్రామానికి మార్గదర్శకంగా నిలిచిన సబ్బవరపు ముత్యాలనాయుడు (తాత) తీర్థం ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కె.కోటపాడు మాజీ ఎంపీపీ సబ్బవరపు పుష్పరామునాయుడు, నాయకులు ఎస్.అప్పలనాయుడు, సూర్యనారాయణ, ముత్యాలనాయుడు, వాసు సహకారంతో ముగ్గుల పోటీలు, సైకిల్ స్లో పందేలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# రాష్ట్రం మరింత అభివృద్ధి

» ప్రణాళికలు సిద్ధం » విలేకరుల సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

కొత్తూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేశామని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ స్పష్టం చేశారు. ఆదివారం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు ఆదాయంపై పూర్తిగా పన్ను మినహాయింపు ప్రకటించడం ద్వారా మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట కల్పించినట్లైందన్నారు. మత్స్యకారులు, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగపడే అనేక పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్టు చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ విశాఖపట్నం వచ్చినప్పుడు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు రూ.1.8 లక్షల కోట్లు, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుకు రూ.14వేల కోట్లతో శంకుస్థాపన చేశారన్నారు. అదే విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించారని, రాష్ట్ర ప్రభుత్వం తరపున పాయకరావుపేట నియోజకవర్గంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కృషి చేశారని తెలిపారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వంలో జిల్లాను అభివృద్ధి పథాన పయనిస్తుందని చెప్పేందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. అనకాపల్లి నుంచి రాజమండ్రి వరకు ఆరు లైన్ల నిర్మాణానికి టెండర్ దశకు రావడం జరిగిందన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని జోస్యం చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెడుతున్నామన్నారు. అనంతరం ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయంపై పార్టీ నాయకులతో కలిసి స్వీట్లు పంచిపెట్టి, బాణసంచా కాల్చారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొయ్యూరు పుణ్యగిరిపై వెలసిన మల్లికార్జున స్వామి ఆలయం



శిథిల అవశేషాలతో సింహాద్రి అప్పన్న ఆలయ ప్రాంతం

# శిథిల కట్టడాల్లో చారిత్రిక ఆనవాళ్లు

- అసంపూర్తిగా కొయ్యూరులో సింహాద్రి అప్పన్న ఆలయం
- దేవతల నిర్మాణ ప్రదేశంగా ప్రతీతి
- ప్రాచీన క్షేత్రంపై నిరాదరణ

కొయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వయంభూగా వెలసిన జిల్లాలో కొయ్యూరులోని భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో దేవతలు నిర్మించతలపెట్టిన భావిస్తున్న సింహాద్రి అప్పన్న ఆలయం కనుమరుగవుతోంది. క్రీస్తు శకం 1089లో మల్లికార్జున స్వామి ఆలయానికి కూత వేటు దూరంలో దేవతలు సింహాద్రి అప్పన్న ఆలయం నిర్మాణానికి సామగ్రిని సైతం సిద్ధం చేశారని, అయితే అదే ప్రాంతంలో వెలసిన మల్లన్న తన ప్రాబల్యాన్ని కోల్పోలేక కోడి రూపంలో కూత వేయటంతో దేవతలు ఆలయ నిర్మాణాలు అసంపూర్తిగా వదిలి వెళ్లినట్టు ఓ పౌరాణిక కథనం ప్రచారంలో ఉంది. సింహాద్రి అప్పన్న ఆలయ నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన కలపను మల్లన్న కాలితో తన్నటంతో ఆ కలప సింహాచలం కొండపై పడటం మల్లన్న ఆదేశాలతో ఆప్రాంతంలో సింహాద్రి అప్పన్న ఆలయం నిర్మించినట్టుగా స్థానిక పురాణాలు చెపుతున్నాయి. ఆలయ నిర్మాణాలకు ప్రతిష్ఠించిన కలశాన్ని కోడి రూపంలో ఉన్న మల్లన్న తన్నారు. ఇది రెండు ముక్కలుగా కత్తిగా వీడింది. ఒక ముక్క కొండపైన భ్రమరాంబిక సహిత మల్లికార్జునుడిగా, దిగువన పడిన ముక్క ఉబ్బ లింగేశ్వరునిగా పూజలందుకుంటున్నారు. ఇంతటి మహిమాన్వితమైన ప్రాచుర్యం కలిగిన ప్రాంతం మల్లిచదునుగా పిలుస్తారు. ఈ స్థలం నిరాదరణకు గురవుతోంది. దేవతలు అసంపూర్తిగా చేసిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. పూర్వీకులు చెప్పే ఈ కథ నిజమనటానికి మల్లిచదును ప్రాంతంలో నేటికీ అనేక ఆనవాళ్లు కనిపిస్తుండం విశేషం. ఆలయ నిర్మాణాలకు సిద్ధం చేసిన 12 అడుగులు పొడవైన రాతి స్తంభాలు నేటికీ దర్శనమిస్తున్నాయి.

### అయ్యప్ప ఆలయ నిర్మాణాలకు సంకల్పం

మల్లి చదును ప్రాంతంలో దేవతలు అసంపూర్తిగా నిలిపిన సింహాద్రి అప్పన్న ఆలయ స్థానంలో నాటి ఆనవాళ్లను వినియోగించి అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణాలకు కొయ్యూరుకు చెందిన ఎంవీవీ ప్రసాద్, అనిశెట్టి చిరంజీవి, సర్పంచ్ బాలరాజుతో పాటు మల్లి కార్జున స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సాయిశర్మ తదితరులు సంకల్పించారు. ఇక్కడి స్థల పురాణాన్ని, పవిత్ర గాథను భావి తరాలకు తెలియ చేసేందుకు వీలుగా ఈ సుందర శిఖరాగ్ర ప్రదేశంలో అయ్యప్ప ఆలయ నిర్మించాలని వారు ముందడుగు వేస్తున్నారు. మల్లి చదునులో నిర్మించనున్న మణికంఠుని ఆలయం తిరిగి శబరిమల ఆలయ ప్రాచుర్యం సంతరించుకునే అవకాశం కలుగుతుందని శబరిమల ఆలయంకు ఎలా కాలినడకన వెళతారో మల్లిచదును లో ఆలయం నిర్మిస్తే అదే తరహాలో వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా చరిత్ర సాక్షాలు కనుమరుగు కాకుండా ఉంటుందని పలువరు పేర్కొంటున్నారు.



దేవతలు సేకరించిన నిర్మాణ సామగ్రి

### మహాశివరా త్రికి ఏర్పాట్లు

స్థానిక భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఏటా నిర్వహించే మహాశివరాత్రికి పరిసర ప్రాంతాల భక్తులు వస్తుంటారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

## కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతం నుంచి వచ్చిన వందలాది మందితో ఆలయం ఆదివారం ఉదయం 7 గంటల నుంచే రద్దీగా మారింది. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బంధు, మిత్రులతో పండగ జరుపుకుని ఆనందంగా గడిపారు. పట్టణంలోని గుడివాడకు చెందిన మహి ఎలివెన్స్ యూత్ సభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.వెంకటరమణ, సీహెచ్.రామకృష్ణ, డీపీ.రాము, జి.శంకరరావు, టి.ఈశ్వరరావు, కె.వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్, కారం దేముడు, కె.రాధాకృష్ణం నాయుడు తదితరులు పాల్గొన్నారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద ఉన్న అమ్మవారి పాదాలను దర్శించుకొనేందుకు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు వచ్చి మొక్కులు చెల్లించారు.

## రామాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయ గోపురం మూసివేత పురస్కరించుకుని పూలుచేస్తున్న దృశ్యం

సీలేరు, ఫిబ్రవరి 9 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలో వలసగెడ్డ రామాలయం పునర్నిర్మాణం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బ్రహ్మకపాలయం మూసివేత పురస్కరించుకుని సీలేరు అయ్యప్పస్వామి ఆలయం అర్చకుడు దామోదర స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి దంపతులతో ప్రత్యే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనం తరం బ్రహ్మకపాలంను మూసివేశారు. ఈ సందర్భంగా సీలేరుకు చెందిన ఏపీ జెన్‌కో ఏఈఈ సుబ్రమణ్యం ఆర్థిక సహకారంతో అన్నసమారాధనను ఏర్పాటు చేసారు. ఈ గ్రామంలో రామాలయాన్ని హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి రిటైర్డు వైద్యాధికారి ముక్తేశ్వరరావు ఆర్థిక సహాయంతో పునర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోపురం మూసివేశారు. ఆలయం అభివృద్ధికి మరింతమంది దాతలు సహకరించాలని ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు జయప్రసాద్ ఈ సందర్భంగా కోరారు.

## జాతీయ స్థాయి పరుగు పోటీల్లో సత్తా చాటిన గిరిజన యువకుడు



పతకాలతో ప్రసాద్

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 9( ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన గిరిజనుడు కుర్తాడి ప్రసాదు అథ్లెటిక్స్‌లో సత్తా చాటాడు. ఈ నెల 6 నుంచి 8వ తేది వరకు రాజస్థాన్ రా ష్ట్రం ఆళ్వార్‌లోని రాజ్‌రిషి కాలేజీ క్రీడా మైదానంలో నిర్వహించిన 44వ నేషనల్ మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ - 2025 పరుగు పందెంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రసాదు పాల్గొన్నాడు. 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచి రజతం, 400, 1500 మీటర్ల పరుగు పోటీల్లో తృతీయ స్థానాల్లో నిలిచి రెండు కాంస్య పతకాలు సాధించాడు. ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మంగా వరప్రసాదు చేతుల మీదుగా ప్రసాదు పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందుకున్నాడు. త్వరలో శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.

## పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

చింతపల్లి, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి పీఆర్‌టియూ ప్రత్యేక కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు యు.వి. గిరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పీఆర్‌టియూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతంలో వివిధ హోదాల్లో పనిచేసిన సీనియర్ నాయకులు వసుపరి శ్యామ్యూల్‌ని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ 1972 లో పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్‌గా స్థాపించిన ఉపాధ్యాయుల సంఘం అనంతరం ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్‌గా రూపాంతరం చెందిందన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, మహిళలకు ప్రత్యేక జీవోల సాధనంలో పీఆర్‌టియూ ప్రత్యేక కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కొర్రు మత్సలింగం, మండల గౌరవ అధ్యక్షులు శెట్టి ఉత్తర కుమారి ఉపాధ్యాయులు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కోడిపుంజువలసలో చిన్నారులకు అస్వస్థత

- వాంతులు, విరేచనాలతో అరకు ఆస్పత్రిలో చికిత్స
- పరామర్శించిన ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



చిన్నారులను పరామర్శిస్తున్న గిరిజన సంఘం నేతలు

అరకులోయ,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరగాం గ్రామ పంచాయతీ కోడిపుంజువలస గ్రామంలో వాంతులు, విరేచనాలు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్న పదేళ్లలోపు చిన్నారులు అస్వస్థత పాలయ్యారు. వీరంతా ఆదివారం ఉదయం అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో చేరారు. ఇలా చికిత్స పొందుతున్న వారిలో గ్రామానికి చెందిన బారికి సుమలత (9), జన్నిశ్రేష్టిత (4), జన్ని రాహుల్ (5), కొర్రా రజని(10) , మాదల జాన్‌పాల్ (9), జన్ని హర్షణి (7) ఉన్నారు. వీరిని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో సంఘ నాయకులు పరామర్శించారు. అందుతున్న వైద్యసేవలు, వారి ఆ రోగ్య పరిస్థితిపై ఆరా తీ శారు. వారందరికి మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులను సూచించారు. అలాగే, గ్రామంలో తక్షణం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి అనారోగ్యంతో బాధపడుతున్న మిగిలిన వారికి వైద్య సేవలదించాలన్నారు. వేసవి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున గ్రామీణానీటిసరఫరా విభాగం, గ్రామ పంచాయతీ వారు సమన్వయంతో శుద్ధ జలాలు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చిన్నారులను పరామర్శించిన వారిలో గిరిజన సంఘం మండల కార్యదర్శి బుజ్జిబాబు, పాంగి రామన్న, పాంగి నాని, బుజ్జిబాబు, కిండంగి రామారావు తదితరులున్నారు.

## 17వ రోజుకు చేరిన నిరసన దీక్షలు



ఏకలవ్య పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న భూ దాతలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయానికి సాగు భూములు ఇచ్చిన గిరిజన కుటుంబాలు చేపడుతున్న నిరసన దీక్షలు ఆదివారానికి 17వ రోజుకు చేరుకున్నాయి. విద్యాలయ నిర్మాణానికి సాగు భూములు ఇచ్చి ఏడేళ్లు కావస్తున్నా తమకు ఉపాధి కల్పించకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండం సరికాదని బాధిత గిరిజనులు డొంబు, రాంచందర్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పట్టించుకోలేదని లేదని వారన్నారు. ఉపాధి కల్పిస్తారనే ఆశతో భూములు ఇచ్చామని, లోపాయికారిగా బయట వ్యక్తులను నియమించి తమను విస్మరించాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉపాధి కల్పించకుంటే విద్యాలయ భవనాలను స్వాధీనం చేసుకుని కుటుంబాల సమేతంగా వాటిలో గడుపుతామని వారు హెచ్చరించారు.

## మత్స్యగుండంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



మత్స్య లింగేశ్వర స్వామి

హుకుంపేట ఫిబ్రవరి 9 ఆంధ్రజ్యోతి; ప్రముఖ్య పుణ్యక్షేత్రం మత్స్యగుండంలోని మత్స్య లింగేశ్వర స్వామి ఆలయం మహాశివరా త్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. భక్తుల సౌకర్యార్థం మండలంలోని మఠం పంచాయతీలో ఉన్న ఈ ఆలయం వరకు రూ. 4. 5 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు పంచాయతీ రాజ్ ఇంజ నీరింగ్ అధికారి ఎస్. సంజీవరావు తెలిపారు. ఉత్స వ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తు్న్నారు.

# కబళించిన కెరటం



సంఘటనా స్థలంలో పోలీసులు

... 5వ పేజీ తరువాయి

మొక్క శ్రీధర్, మల్లికార్జునరావులు విశాఖలో స్థిరపడ్డారు. ఎల్‌అండ్‌టిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ కంచరపాలెం ప్రాంతంలోని ఇంద్రానగర్‌లో, సీఐఎస్‌ఎఫ్‌లో పనిచేస్తున్న మల్లికార్జునరావు దువ్వాడ సంధ్యానగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీధర్ ఒక్కగానొక్క కుమారుడు సూర్యతేజ (17) తగరపువలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో, ఆదినారాయణ ఒక్కగానొక్క కుమారుడు పవన్‌తేజ (17) దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. శ్రీధర్, మల్లికార్జునరావులు పూజల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం స్వగ్రామమైన కొత్తపేట వచ్చారు. పూజా కార్యక్రమాలు పూర్తిచేసుకొని మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వాడపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. సూర్యతేజ, పవన్‌తేజ సహా నలుగురు తీరానికి సమీపంలో స్నానాలు చేస్తుండగా బలమైన కెరటం ఒకటి లోపలకు లాగేసింది. తీరం వద్ద బీట్‌లో ఉన్న మెరైన్ పోలీసులు చూసి ముగ్గురిని రక్షించారు. మరొకరి ఆచూకీ దొరకలేదు. మెరైన్ పోలీసులు రక్షించిన ముగ్గురిలో కొనఊపిరితో ఉన్న సూర్యతేజ (17) ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయాడు. గల్లంతైన పవన్‌తేజ (17) ఆచూకీ కోసం పోలీసులు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, రాంబిల్లి సీఐ నరసింగరావు, మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్‌ఐ నాగేంద్రలు సిబ్బందితో కలిసి వాడపాలెం సముద్రతీరం వద్దకు చేరుకున్నారు. సూర్యతేజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. కాగా సూర్యతేజ మృతదేహం వద్ద అతని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు పలువురిని కలచివేసింది. పై సంఘటనతో కొత్తపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కమ్మేసిన పొగమంచు

... 5వ పేజీ తరువాయి



దేవరాపల్లి మండలం నాగయ్యపేటలో ఆదివారం ఉదయం 8కు కురుస్తున్న మంచు

పంటల్లో ఆకులు, పూత మాడిపోతాయని చెబుతున్నారు.

### దేవరాపల్లిలో...

**దేవరాపల్లి:** మండలంలో ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు పొగమంచు వీడలేదు. రెండు రోజుల క్రితం రాత్రి వేళ వర్షం మాదిరిగా మంచు కురిసింది. ఆదివారం కూడా పొగమంచు దట్టంగా కురిసింది. దీని వల్ల మామిడి, జీడి, నువ్వులు పూత మంచుకు మాడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# భూ బదలాయింపు చట్టం సవరణ యోచనపై పోరాటం

### మన్యం బంద్‌పై విస్తృత ప్రచారం

పాడేరురూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 1/70 భూబదలాయింపు చట్టం సవరణకు ప్రయత్నిస్తే ప్రతిఘటిస్తామని గిరిజన, ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ నాయకుడు పాలికి లక్కు ఆధ్వర్యంలో ఆదివారం గుర్రగరువు గ్రామంలో ఈ నెల 11, 12 తేదీల్లో చేపట్టనున్న మన్యం బంద్‌కు సంబంధించి పోస్టర్లుఆవిష్కరించారు. చట్ట సవరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించిబంద్‌ను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన కాఫీ రైతులు సూరిబాబు, వీర్రాజు, పాలికి రాజు, పాంగి ఆనందరావు, పాంగి మత్స్యరాజు, బాలన్న, మోహన్‌బాబు పాల్గొన్నారు. మన్యం బంద్‌ను విజయవం తానికి అఖిల పక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఏఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, మహిళా సం ఘం నేతలు విమల, రమణమ్మ పాల్గొన్నారు.

### బంద్‌ను గిరిజన విద్యార్థులు విజయవంతం చేయాలి

మన్యం బంద్ విజయవంతానికి గిరిజన విద్యార్థులు, యువత, మహిళలు కృషి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం వారు పోస్టర్లు విడుదల చేశారు. విద్యార్థి సంఘం నాయకులు బి.పెంటారావు, కె.సురేష్, మంగ పాల్గొన్నారు.




సుంకరమెట్ట వారపు సంతలో గిరిజన సంఘం నేతల ప్రచారం



ముంచంగిపుట్టులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**ముంచంగిపుట్టు:** ఆదివాసీల చట్టాలు, హక్కుల జోలికి ఎవరైనా వస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి అన్నారు. మండల కేంద్రంలో మన్యం బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బీఎస్పీ నేత మాదవరావు, జేఏసీ ప్రతినిధులు రామక్రిష్ణ, బాబూరావు, కొండపడాల్, మాలయ్య, సమరెడ్డి రామారావు, కామేశ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

**సీలేరు:** ధారకొండలో ఆదివారం సమావేశమయ్యారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అం పురంగి బుజ్జిబాబు, గిరిజన సంఘం నేత కె బాలయ్య, సీపీఐ, సీపీ ఎం నేతలు విష్ణుమూర్తి, బి. కోటేశ్వరరావు, దుప్పులవాడ మాజీ సర్పంచ్ అల్లంకి రాజు, పెసా సభ్యులు రాంబాబు, ధర్మరాజు పా ల్గొన్నారు.

**పెదబయలు:** రోగులపేట జంక్షన్ వద్ద పెసా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు. ఆదివాసీ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో మన్యం బంద్‌పై పోస్టర్లు విడుదల చేశారు. సీతగుంటఉపసర్పంచ్ గంగాధర్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మనపడాల్, బోండ గణేశ్వరరావు, దేవినాయుడు,నాని , భూదేవి పాల్గొన్నారు.

**అరకులోయ:** మన్యం బంద్‌కు అల్లూరి యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు సంఘ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు పి.దేముడు, ఎస్.కన్న య్య, కె.రఘునాథ్, ఎల్.బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పొద్దు బాలదేవ్ ఆధ్వర్యంలో ఆదివారం సుంకరమెట్ట వారపు సంతలో బంద్‌పై విస్తృత ప్రచారం చేపట్టారు.నేతలు గత్తుం బుజ్జిబాబు, కె.రామారావు, కె.బుజ్జిబాబు,పి.నాని, టి.జోగులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

**హుకుంపేట;** మండలంలోని పలు గ్రామాల్లో గిరిజన సంఘ నాయకుడు టి. కృష్ణారావు నేతృత్వంలో ప్రచారం చేశారు. గిరిజన సంఘ నాయకులు రామారావు, లింగమూర్తి, తదితరులున్నారు.

చింతపల్లి: మన్యం బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు.

**అనంతగిరి:** మండలంలోని చిలకలగెడ్డ నుంచి అనంతగిరి వరకు దుకాణాదారులకు బంద్‌కు సహకరించాలని జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు ఆధ్వర్యంలో మన్యం బంద్ జయ ప్రదం చేయాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలోని వైసీపీ నేత కొర్రా సూర్యానారాయణ, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ అశోక్, తౌటినాయుడు, లక్ష్మణరావు, దేవన్న, సింగులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

# క్రెబ్స్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

నిర్ధారించి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో ఈ నెల 7న సభ్య కార్యదర్శి శరవన్ కొత్తపల్లిలో క్రెబ్ కంపెనీ మూసివేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### కంపెనీపై అనేక ఫిర్యాదులు

క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీపై చాలా కాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. కంపెనీ నుంచి వచ్చే దుర్గంధంతో సమీపంలోని కేజీబీవీ పాఠశాల, తేగాడలో మోడల్ స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధిచేయకుండా శారదా నదిలోకి విడిచిపెట్టడం, కంపెనీని ఆనుకుని గొయ్యిలో నింపుతున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితం కావడంతో కంపెనీ సమీపంలోని గంటవానిపాలెం గ్రామస్థులు గతంలో ఆందోళనలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీసీబీ అధికారులు తనిఖీలు చేసి 2023 డిసెంబరులో ఒకసారి కంపెనీని మూసివేయాలని ఆదేశించారు. తరువాత పీసీబీ నిబంధనల మేరకు కంపెనీ కొన్ని దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో గత ఏడాది జనవరిలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించడానికి అనుమతించారు. తాజాగా కంపెనీ నుంచి వ్యర్థాలు విజయవాడ రూరల్‌లోని జక్కంపూడిలో పారబోయడంతో విచారణ జరిపిన పీసీబీ మరోసారి మూసివేతకు ఆదేశాలు ఇచ్చింది.

# రాష్ట్రం మరింత అభివృద్ధి

▸ ప్రణాళికలు సిద్ధం ▸ కూటమి పాలనలో జిల్లా ప్రగతి

▸ విలేకరుల సమావేశంలో ఎంపీ సీఎం రమేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

కొత్తూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేశామని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ స్పష్టం చేశారు. ఆదివారం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు ఆదాయంపై పూర్తిగా పన్ను మినహాయింపు ప్రకటించడం ద్వారా మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట కల్పించినట్లైందన్నారు. మత్స్యకారులు, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగపడే అనేక పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్టు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం వచ్చినప్పుడు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు రూ.1.8 లక్షల కోట్లు, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుకు రూ.14వేల కోట్లతో శంకుస్థాపన చేశారన్నారు. అదే విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించారని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పాయకరావుపేట నియోజకవర్గంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కృషి చేశారని తెలిపారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వంలో జిల్లాను అభివృద్ధి పథాన పయనిస్తుందని చెప్పేందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. అనకాపల్లి నుంచి రాజమండ్రి వరకు ఆరు లైన్ల నిర్మాణానికి టెండర్ దశకు రావడం జరిగిందన్నారు. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో కూడా బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని జోస్యం చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెడుతున్నామన్నారు. అనంతరం ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయంపై పార్టీ నాయకులతో కలిసి స్వీట్లు పంచిపెట్టి, బాణసంచా కాల్చారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గీత కులాల వారి మద్యం షాపుల లాటరీ వాయిదా

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎక్సైజ్ ప్రొహిషన్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ సోమవారం జరగాల్సిన గీత కులాల వారి మద్యం షాపుల లాటరీ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున వాయిదా వేసినట్టు వివరించారు. దరఖాస్తుదారులంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. లాటరీ ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్‌ను త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

## నేటి నుంచి పిట్టవానిపాలెంలో పైడితల్లి జాతర



పరవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలో సోమ, మంగళవారాల్లో పైడితల్లి అమ్మవారి జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే ప్రధాన రహదారి నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

## 'పచ్చదనం పెంపు సామాజిక బాధ్యత'




మొక్క నాటుతున్న రాంకీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) అన్నారు. సుంకరమెట్ట జంక్షన్‌లోని సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ పచ్చదనం పెంపు సామాజిక బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ, గ్రీన్‌క్లబ్ ప్రతినిధులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, పెంటకోట ఉమామహేశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, యల్లపు సూరిఅప్పారావు, ఆర్.అనిత, పి.భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పరుగు పోటీలు



బరిలో పరుగు తీస్తున్న ఎడ్ల బండ్లు

కశింకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో ఆంజనేయ తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలను ఏర్పాటు చేయగా, పన్నెండు బండ్లు బరిలో పరుగు తీశాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజా, వైసీపీ నాయకులు మలసాల కుమార్‌రాజా, కిశోర్, కలగ గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# మరిడిమాంబకు సారె

▸ విజయరామరాజుపేటలో అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ▸ తరలి వచ్చిన భక్తజనం ▸ మహిళలు ఊరేగింపుగా వచ్చి పిండి వంటలు సమర్పణ



పురవీధుల్లో సారె ఊరేగింపు



అమ్మవారి ఆలయంలో నైవేద్యంగా సమర్పించేందుకు ఏర్పాటు చేసిన సారె

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి విజయరామరాజుపేటలోని మరిడిమాంబ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఇదిలావుంటే, విజయరామరాజుపేట, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు తమ ఇళ్ల వద్ద తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలను పళ్లాల్లో పేర్చి, మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ అమ్మవారికి సారెగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ, కార్యదర్శి పలకా రాము, ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పిట్ల బుద్దేశ్వరరావు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా చౌడేశ్వరి సాంబశివుని కల్యాణం

▸ తిరువీధి సేవ, రథయాత్రకు పోటెత్తిన భక్తులు



స్వామి, అమ్మవార్ల కల్యాణం దృశ్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినరాజుపేటలో గల చౌడేశ్వరి సాంబశివ ఆలయం వద్ద శనివారం రాత్రి స్వామి, అమ్మవార్ల వార్షిక కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీశెట్టి మురళీకృష్ణ, సావిత్రి దంపతులు, రెడ్డి కాశీవిశ్వనాథ్, మోహిని వరలక్ష్మి దంపతులు కల్యాణంలో కూర్చొనగా అర్చకులు శాస్త్రోక్తంగా ఈ వేడుకను జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి చౌడేశ్వరి సాంబశివుడ్ని దర్శించుకున్నారు. ఇదిలావుంటే, సాయంత్రం తిరువీధి సేవ, రథయాత్ర అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు.

## పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

▸ కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యుడు బాబూజీ డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కార్యవర్గ సభ్యుడు బాబూజీ

కొత్తూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం కేంద్ర కార్యవర్గ సభ్యుడు వి.బాబూజీ, కాకినాడ డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు, సిహెచ్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాత పెన్షన్ పద్ధతిని తిరిగి అమలు చేయాలని, కరోనా కాలంలో నిలుపుదల చేసిన 18 నెలల డీఆర్ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి కోరారు. అలాగే, అమ్మిన పెన్షన్‌ను ప్రస్తుతం ఉన్నట్టు పదిహేను సంవత్సరాలు కాకుండా పన్నెండు సంవత్సరాలకు కుదించాలని, ఎన్పీఎస్ పెన్షనర్లకు సీజీహెచ్ఎస్, ఫిక్స్ మెడికల్ అలవెన్సు అమలు చేయాలని, 2006 సంవత్సరం తర్వాత జూన్, డిసెంబర్‌లలో పదవీ విరమణ పొందిన వారికి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 65, 70, 75 సంవత్సరాలు రాగానే ఐదు శాతం, పదిశాతం, పదిహేను శాతం అదనపు పెన్షన్ మంజూరు చేయాలని, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, కార్యదర్శి కె.రాజారావు, డివిజనల్ సంఘం కోశాధికారి టి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌జీ పాలెం వద్ద తప్పిన పెను ప్రమాదం

▸ లారీ, ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీ

▸ డ్రైవర్‌కు తీవ్ర, ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు




ఘటనా స్థలంలో వేచి ఉన్న బస్సులోని ప్రయాణికులు

కశింకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూతనగుంటపాలెం (ఎన్‌జీ పాలెం) జాతీయ రహదారిపై ఆదివారం లారీ, ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. ఒడిశాలోని పూరీ నుంచి తెలంగాణకు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఇక్కడి నూతనగుంటపాలెం వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జయ్యింది. డ్రైవర్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆ సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 30 మందిలో సుమారు ఐదుగురు స్వల్పంగా గాయపడినట్టు తెలిసింది. డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. లారీ అక్కడి నుంచి పరారైంది. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారుగా తెలిసింది. అనంతరం ప్రొక్లైనర్ సహాయంతో బస్సును పక్కకు తీశారు.

## స్నేహితునికి పూర్వ విద్యార్థులు బాసట



నగదు అందిస్తున్న మిత్రులు

సబ్బవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితునికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసి బాసటగా నిలిచారు. 2005-06 విద్యా సంవత్సరంలో మండలంలోని రావలమ్మపాలెం హైస్కూల్ వారంతా పదో తరగతి చదువుకున్నారు. తమ బ్యాచ్‌కు చెందిన శ్రీకాకుళపు ఆనందం బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై వైద్య చికిత్సలు పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నాటి స్నేహితులు ఆదివారం అంతకాపల్లి గ్రామానికి వెళ్లి తమ స్నేహితునికి రూ.30 వేల నగదును అందజేసి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గొంప లక్ష్మణ, గండి అలీ, జి.రమేశ్, సీహెచ్.రాంబాబు, గోర్స ప్రకాశ్, గుదే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'ధర్మనిధి సభ్యత్వం విరివిగా చేయాలి'

పరవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : హిందువులంతా ధర్మనిధి సభ్యత్వాన్ని పొందాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని రావాడ గ్రామంలో గల రామాలయంలో ఆదివారం ధర్మనిధి సభ్యత్వ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. హిందూ సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనం గూరించి నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు తోట నాగరాజు, మోటూరు సన్నిబాబు, తోట సత్యనారాయణ, రాము, అచ్చిబాబు, కె.శ్రీను, గొన్న నాగరాజు, సీహెచ్.శ్రీనివాసరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## అదరహో.. ఆనందమేళా

▸ ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

▸ సంప్రదాయ దుస్తులతో దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు సందడి



జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సింహాద్రి హెచ్‌వోపీ సమీర్‌శర్మ



సంప్రదాయ దుస్తుల్లో దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు

పరవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీకు చెందిన దీపాంజలినగర్ సాధన క్రీడా మైదానంలో శనివారం రాత్రి దీపికా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆనందమేళా అదరహో అనిపించింది. సింహాద్రి ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఈ మేళాలో ఉత్సాహంగా గడిపారు. సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌వోపీ) సమీర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందానిస్తోందన్నారు. రెండు రోజుల పాటు మేళా కొనసాగుతాదన్నారు. ఉద్యోగులంతా ఉత్సాహంగా గడపాలని కోరారు. దీపికా లేడీస్ క్లబ్ ప్రతతినిధులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్ అలరించాయి. వివిధ రకాల పూల మొక్కల ప్రదర్శన, కుంభమేళా సైకత శిల్పం, శివపూజ, వినాయక దేవాలయం ఆకృతులు, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, మ్యాజిక్ షో తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చదువులో ప్రతిభ చాటిన పది మంది పేద విద్యార్థులకు హెచ్‌వోపీ చేతుల మీదుగా సైకిళ్లు అందజేశారు. దీపికా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. క్లబ్ అధ్యక్షురాలు నీతాశర్మ, సింహాద్రి సంస్థకు చెందిన వివిధ విభాగాల జీఎంలు, హెచ్‌వోడీలు, ఏజీఎంలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కంటైనర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

కొత్తూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని పిసినికాడ జాతీయ రహదారిపై గుర్తు తెలియని కంటైనర్ ద్విచక్ర వాహనదారున్ని ఢీకొన్న సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలివి. కశింకోట నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనాన్ని నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకవైపు కూర్చున్న మరో యువకుడు స్వల్పంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మృతుడు పూల్‌బాగ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నట్టు తెలిసింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శారదా నదిలో పడి వృద్ధుడు మృతి



షేక్ ఇస్మాయిల్ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదా నదిలో ప్రమాదవశాత్తూ జారి పడి ఓ వృద్ధుడు మృతిచెందినట్టు ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. విజయనగరానికి చెందిన షేక్ ఇస్మాయిల్ (63) శుక్రవారం సాయంత్రం అక్కడి నుంచి అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న దేవీనగర్‌లో నివాసముంటున్న చెల్లెలు తాజు ఇంటికి బస్సులో బయల్దేరారన్నారు. అనకాపల్లి వచ్చిన ఆయన శారదానది ఒడ్డున శివాలయం సమీపంలో నదిలో దిగే సమయంలో ప్రమాదవశాత్తూ జారిపడిపోయి మృతి చెంది ఉంటారని భావిస్తున్నట్టు చెప్పారు. విజయనగరం నుంచి బయల్దేరిన ఇస్మాయిల్ చెల్లెలు ఇంటికి చేరకపోవడంతో అనుమానం వచ్చి వెతకగా, ఆదివారం ఉదయం నదిలోని మృతదేహం తేలి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారన్నారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కేంద్ర అవార్డు గ్రహీత వీవోఏకు సత్కారం



ఉషాను సత్కరించిన వీవోఏల సంఘ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మునగపాక మండలం టి.సిరసపల్లికి చెందిన వీవోఏ పొలమరశెట్టి ఉషను వెలుగు వీవోఏల సంఘం ఘనంగా సత్కరించింది. న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలకు హాజరై అవార్డు పొందిన ఆమెను సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వీవీ శ్రీనివాసరావులు సత్కరించారు. డీఆర్‌డీఏ పరిధి సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఉషకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు, కోశాధికారి కె.లక్ష్మీ ప్రసన్న, వై.లక్ష్మి, త్రినాథ్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'కుళాయి నీరు వాడుకకే వినియోగించండి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని ఐదు వార్డులకు తాగునీటి విభాగం అధికారులు సరఫరా చేస్తున్న కుళాయి నీటిని వాడుకకు వినియోగించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఒక ప్రకటనలో సూచించారు. రెండు రోజుల క్రితం తుమ్మపాల పరిధిలోని ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రం వద్ద నీరు కలుషితం కావడంతో సరఫరాను నిలిపివేశారని వివరించారు. ప్రస్తుతం నీటి పారుదల శాఖ అధికారులు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల పరిశుభ్రమైన తాగునీరు అందించే వరకు ప్రస్తుతం కుళాయిల ద్వారా వస్తున్న నీటిని తాగడానికి ఉపయోగించకుండా ఇంటి వాడకకు మాత్రమే వినియోగించాలని ఆయన కోరారు.

## 16న బాల్ బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఈ నెల 16న ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి బాల్ బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఈనెల 15వ తేదీ సాయంత్రం ఆరు గంటలలోపు తమ పేర్లను కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు, జ్ఞాపికలను అందజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 70756 13517, 94934 24345 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.